
# అబ్బిగాడి పెళ్ళి

## తోలేటి జగన్మోహనరావు




రిటైర్డు డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు నరసింహంగారు ఉదయం తొమ్మిదవుతుండగా పసుపువచ్చ రంగు చొక్కా నల్లపాంటులో టక్ చేసి, పొట్టుబస్తా బిగించి కట్టినట్లు పొట్టకి నీలం-తెలుపు చారల బెల్టు బిగించి, 'పాతాళభైరవి' ఉదయం ఆటకి "కలవరమాయె మదిలో నా మదిలో" అని కూనిరాగం తీస్తూ బయలుదేరారు.

'పాతాళభైరవి' ఆయన వయసులో ఉన్నప్పుడు ఎప్పుడో పదిసార్లు చూశారు. అంతగా ఆయనకు నచ్చిన చిత్రం అది. నిన్నరాత్రి పని కుర్రాడు రంగా 'పాతాళభైరవి' ఉదయం ఆటగా వచ్చిందని చెప్పినప్పుడు ఆయన హృదయం ఎగిరి పడింది. వాడు రేపే ఆఖరాట అని చెప్పినప్పుడు ఆరు నూరైనా, నూరు ఆరైనా, మూడు తొమ్మిదైనా రేపు వెళ్ళి తీరాలి అనుకున్నారు ఆయన.

ఆయన పేరుకు సింహం అయినా. అనసూయగారితో పెళ్ళైనప్పట్నుంచీ పిల్లిలా అయిపోయారు. తను సినిమాకే వెడుతున్నట్టు ఆవిడ వసిగట్టిందంటే— 'ఏవిటి చిన్న పిల్లాడిలా! ఈ వయసులో ఆ 'సినిమాలు' అని మండిపడుతుంది. అంచేత ఆవిడకి తెలియకుండా ఆయన హాలు లోంచి బయటికి జారుతుంటే "ఎక్కడికి బయలుదేరారు?" అన్న కేక వినిపించింది

ఆయన అదిరిపడి ఆగిపోయాడు.

సతీ అనసూయగారు సన్నగా పిచికలా ఉంటుంది కాని. సింహంగారిని మాత్రం గడగడలాడించేస్తుంది. "ఎక్కడికి వెడుతున్నారంటే రాయిలా అలా నిలబడతారేం?" అని గద్దించింది మళ్ళీ.

"జై పాతాళభైరవీ!" 'పాతాళభైరవి' గురించే ఆలోచిస్తున్న సింహంగారు ఉలిక్కి పడి అరిచారు.

"ఏవిటా పిచ్చివాగుడు? ఇవాళ అబ్బిగాడికి పెళ్ళిచూపులు. ఇల్లు కదలడానికి వీల్లేదు" అని ఆర్డరు జారీ చేసింది ఆవిడ.

నర సింహంగారి బుర్ర పని చేయడం మానేసింది. నిన్న రాత్రి ఆ సినిమాగురించి రంగాగాడు చెప్పినప్పట్నుంచీ ఆయన సినిమాలో సన్నివేశాలు గుర్తుకు తెచ్చుకుని ఎప్పుడు ఆ సినిమా మళ్ళీ చూస్తానా అని కలలు కంటూ రాత్రంతా నిద్రపోలేదు. ఇవాళ ఆఖరాట మిస్సయిపోతే మళ్ళీ జన్మకి ఆ సినిమాచూడగలనా అని విచారిస్తూ పరధ్యానంగా అడిగారు. "అబ్బి గాడెవరు?"

"భగవాన్లు."

"భగవాన్లెవడు?"

"మీ బావమరది!"

" నా బావమరి దెవడు?"—ఆయన నోరు మాట్లాడుతున్నా, ఆయన బుర్రలో ఎస్వీ రంగారావుగారే మెదులుతున్నాడు- 'డింభకా డింగరీ' అంటూ.

"ఒళ్ళు దగ్గరుంచుకు వినండి" అని ఉరిమింది సతీఅనసూయగారు.

సింహంగారు ఒళ్ళు దగ్గరుంచుకు వినసాగారు.

"అబ్బిగాణ్ణి చూడ్డానికి కల్నాలు రావుగారు. ఆయన భార్య వస్తున్నారు."

సతీ అనసూయగారి ఆర్డరులో-ఇల్లు కదలకూడదనేది-ఆయన బుర్రకి చేరగానే ఆయన బుర్ర పని చేయడం మానేసింది. అబ్బిగాణ్ణి చూడకుండా తప్పించుకోడానికి తను శతవిధాల ప్రయత్నిస్తుంటే వాళ్ళెవరో వాణ్ణి ఎందుకు చూడాలనుకుంటున్నారో ఇప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకుని వింటున్న సింహం గారికి అర్థం కాలేదు. అంచేత "ఎందుకు?" అనడిగారు.

అనసూయగారు రెండు చేతులతోనూ కణతలు నొక్కుకుంటూ, "చెప్పాను కదా! అబ్బిగాడికి పెళ్ళి చూపులని" అంది.

"వాడికి పెళ్ళా?" జరగకూడ నిదేదో జరిగిపోతున్నట్టు ఆశ్చర్యపోయారు సింహంగారు.

ఒక్క ఉతుకు ఉతుకుదామా అన్నంత కోపం వచ్చింది అనసూయగారికి. కాని. రేవు పెట్టడానికి ఇది సమయం కాదు. ఆవిడకి వేరే ముఖ్యమయిన పనులు చాలా ఉన్నాయి ఈరోజు. అంచేత శాంతంగా మళ్ళీ మొదలు పెట్టింది. "ఈ రోజు కల్నాలు రావుగారు..."

"కల్నాలు రావెవడు?"

"ఆంజనేయులిగారి తమ్ముడు."

"ఆంజనేయు లెవడు?"

"రాముడికి నమ్మిన బంటు. సరా? ఇంక మాటొద్దు. వాళ్ళు వచ్చి వెళ్ళే దాకా ఇల్లు కదలడానికి వీల్లేదు. వాళ్ళెదురుగా 'అబ్బిగాడికి పెళ్ళి' అని ఇందాకలా అలా నోరు తెరిస్తే ఊరుకునేది లేదు. వాళ్ళతో తూచి తూచి మాట్లాడండి. మాట్లాడడం రాకపోతే మాట్లాడకుండా కూర్చోండి. అర్థమైందా?"

అర్థమైందన్నట్టు తలూపి బండి వెనక్కి తిప్పారు సింహంగారు. భారీ శరీరాన్ని ఈడ్చుకుంటూ ఆయన మేడ మెట్లు ఎక్కుతుంటే. 'ఇంత లావుగా ఉండడానికి. బుర్ర పని చెయ్యక పోవడానికి ఏమైనా సంబంధం ఉందా?' అని ఆలోచిస్తూ నిలబడిపోయింది అనసూయగారు. 'ఇంత డైటింగు చేయిస్తున్నా వంద కేజీలకి ఓ గ్రాము కూడా తగ్గటల్లేదే ఈయన? ఇలా అయితే. ఈయన బి. పి. ఎలా కంట్రోలవుతుంది?' అని నిట్టూర్చింది.

'ఇలాంటి పెళ్ళాం. అలాంటి బావమరది ఉంటే నన్ను మాడ్చి చంపేసినా బి. పి. ఎలా తగ్గుతుంది?' అని నిట్టూర్చారు సింహంగారు—మేడ మీది తన గదిలో సోఫా మీద బాసింపీట వేసుకు కూర్చుని. అనసూయగారు దరిదాపుల్లో లేదని నిర్ధారణ చేసుకుని. "నా తలకాయ" అని గట్టిగా అరిచారు.

క్రింద ఎక్కడో పని చేసుకుంటున్న ఆవిడకి అస్పష్టంగా ఏదో వినిపించి "ఏవిటి" అని ప్రశ్నించింది.

"ఏం లేదు. కొబ్బరికాయలు కావాలా అని అడుగుతున్నాను" అన్నారు సింహంగారు తల కొట్టుకుంటూ.

అలా సోఫా మీద కూర్చుని కూర్చుని మగతగా కన్నుమూ యగానే 'సాహసము శాయరా డింభకా! మేడ దిగి సినిమాకి పారిపోరా డింగరీ' అని ఎస్వీ రంగారావుగారు ప్రత్యక్షమై సలహా ఇచ్చారు. సింహంగారు కలలో మేడ దిగడానికి తాడు మీద చెయ్యి వెయ్యగానే అబ్బిగాడు రంగంలో దిగాడని తెలియజేస్తూ క్రింద గదిలో రేడియో

[illegible]యిమంది. ఎస్వీ రంగారావుగారు మాయమై పోయారు.

"కలలో కూడా సినిమా చూడనివ్వడే వీడు? వీడికి పెళ్ళి కావాలా? ఒరే డబ్బిగా! నీ పెళ్ళి నేను చేస్తారా?" అని నిశ్శబ్దంగా పళ్ళు నూరుతుండగా. "బావా! అక్క భోజనానికి రమ్మంటోంది" అని అబ్బిగాడి కేక వినిపించి లేచారు సింహంగారు.

డైనింగ్ టేబిలు మీద రెండు ప్లేట్లు కనుపించి. "నువ్వు కూడా భోంచేస్తావా?" అన్నారు సతీ అనసూయగారితో దిగులుగా. ఆవిడ పక్కని కూర్చుంటే ఆయన సంతృప్తిగా భోంచేయలేరు. 'అది తింటే లావవుతారు. ఇది తింటే బి. పి. పెరుగుతుంది' అని అన్నీ తీసేస్తుంది ఆవిడ.

"అది అబ్బిగాడికి" అంది ఆవిడ అభిమానంగా. పిల్లలు లేకపోవడంతో తమ్ముడినే ఎంతో ప్రేమగా పెంచింది ఆవిడ.

"నాకూ స్వీటూ?" ఎదురుగా కనిపిస్తున్న గులాబ్‌జాంల ప్లేటు కేసి ఆశగా చూస్తూ నోరు తెరిచి అడిగారు సింహంగారు.

"మీకు స్వీటేమిటి? మతి పోయిందా" అంది ఆవిడ కోపంగా.

ఆయన ప్లేటులో ఆకు కూర కేసి దిగులుగా చూసి ఇంక తప్పదని కలుపుకు తినబోతూండగా అబ్బిగాడు పాకెట్ ట్రాన్సిస్టరుతో ప్రవేశించాడు. సింహంగారు ముద్ద కంచంలో వదిలేశారు.


"ఏం?" అనడిగింది అనసూయగారు.

"డబ్బిగాణ్ణి ఆ ట్రాన్సిస్టరు కట్టెయ్యమను. నాకు క్రికెట్ కామెంటరీ అంటే అసహ్యం. అన్నం కూడా సయించదు."

"అయితే మరీ మంచిది. కొంచెం తక్కువ తింటే లావైనా తగ్గుతారు. ఒరే. అబ్బీ! కొంచెం సౌండు హెచ్చించరా."

సింహం గారికి ఒళ్ళు మండిపోయింది. కాని. చేసేదేంలేక. ఓరకంట అబ్బిగాడు లాగిస్తున్న గులాబ్‌జాంలు లెక్కపెట్టుకుంటూ త్వరగా భోజనం ముగించి మేడమీది తన గదిలోకి వెళ్ళబోయారు పడుకోడానికి.

"పగలు పడుకోవద్దని ఎన్నిసార్లు చెప్పాలి. మళ్ళీ పైకి వెళ్ళనక్కరలేదు. వాళ్ళు వస్తారేమో...



అక్కడ హాల్లో కూర్చోండి."

ఆయన హాలులో సోఫా మీద కూర్చుని కునికిపాట్లు పడుతూ నిద్రలోకి జారారో, లేదో అనసూయగారి గొంతు అగ్నిమాపకదళం వారి గంటలా మోగింది. ఆయన ఉలిక్కిపడి కళ్ళు తెరిచి బయటకు చూశారు.

ఒక కారు వచ్చి గుమ్మం ముందు ఆగింది. కారు ఆగీ ఆగగానే సన్నగా పొడుగ్గా ఉన్న ఓ వ్యక్తి చెంగున క్రిందికి దూకి వెనుక తలుపు తీసి పట్టుకు నిలబడ్డాడు విధేయతగా. ఆయన జుట్టు వెండిలా, తెల్లగా మెరుస్తోంది.

'వీడే కాబోలు కల్నలుగాడు' అనుకున్నారు సింహంగారు లేవకుండానే.

కారు వెనుక సీట్లోంచి ముందొక కాలు దిగింది. తరవాత ఒక చెయ్యి వచ్చి కారు తలుపు పట్టుకుంది. రెండు నిముషాల విరామం తరవాత రెండో కాలు దిగింది. తరవాత క్రేను బరువు దింపినట్లుగా కల్నలు గారి భార్య సావిత్రి గారు దిగింది. ఆవిడ కారు దిగగానే కల్నలుగారు చకచకా తలుపులు మూసేసి చేతులు కట్టుకుని నిలబడ్డారు.

అనసూయగారు ఆదరంగా, "మీ కోసమే ఎదురు చూస్తున్నాం! రండి, రండి" అంటూ ఆహ్వానిస్తూ, "ఏమండోయ్! కల్నలుగారు వచ్చారు" అని సింహంగారిని పిలిచింది.

సింహంగారు అయిష్టంగా లేచి బయటకు వచ్చారు. "హలో పొట్లకాయ్" అని కళ్ళతోనే కల్నలుగార్ని పలకరించారు సింహంగారు.

"హలో గుమ్మడికాయ్" అని కళ్ళతోనే సమాధానమిచ్చారు కల్నలుగారు.

సావిత్రిగారు టాంకులా దారి తీయగా, పదాతి దళంలా మౌనంగా వెనకాలే నడుస్తున్న కల్నలుగారికేసి నిరసనగా చూస్తూ, 'హెన్ పెక్డ్' అనుకున్నారు సింహంగారు, తనూ హెన్-పెక్డ్ అనేమాట క్షణం మర్చిపోయి.

పరిచయాలైన తరవాత, "కల్నలు గారిని మీ గదికి తీసుకు వెళ్ళండి. మే మిద్దరం అబ్బిగాడు వచ్చేదాకా అలా గార్డెన్లో కూర్చుంటాం" అంది అనసూయగారు, తమ మధ్య సింహంగారు ఉండకుంటేనే మంచిదనే ఉద్దేశంతో. అందరిలో మా 'అబ్బిగాడికి పెళ్ళా?' అని ఆయన ఆశ్చర్యం ప్రకటించే ప్రమాదం ఉందని ఆవిడకి తెలును.

కల్నలుగారు అనుమతి కోసం సతీసావిత్రిగారికేసి చూశారు. ఆవిడ బరువెక్కిన మెడ మెల్లగా తిప్పి, "వెళ్ళండి" అంది.

ఆయన స్ప్రింగులా లేచి సింహంగారి వెనుక నడిచారు.

సింహంగారూ, కల్నలుగారూ ఎదు రెదురుగా కూర్చుని మౌనంగా అటూ ఇటూ చూస్తూ, పొరబటున చూపులు కలిసినప్పుడు తలతిప్పేసుకుంటూ కా సేపు గడిపారు. కల్నలుగారు టేబులు మీద పేపరు అందుకుని మొహానికి అడ్డు పెట్టుకున్నారు. క్షణం తరవాత పేపరు వెనుక నుంచి బస్సులు స్టార్టవుతున్నట్టు, పిల్లులు దెబ్బలాడుకుంటున్నట్టు శబ్దాలు రా సాగాయి.

'ఈ పొట్లకాయగాడు పెళ్ళి సంబంధం చూడ్డానికొచ్చాడా?' అని మండిపడ్డారు సింహంగారు-తన ఇంట్లో, తన గదిలో, తన సోఫా మీద కూర్చుని బస్సులూ, టాంకులూ నడిపేస్తున్న కల్నలుగార్ని చూస్తూ.

** ** **

"అబ్బాయి ఏడీ?" అంది సావిత్రిగారు ఆ కబుర్లూ, ఈ కబుర్లూ అయ్యాక.

"ఇప్పుడే వస్తాడు! అలా వెళ్ళాడు." సమాధానమిచ్చింది అనసూయగారు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటున్నా— ఒ కన్ను, ఓ చెవి మేడమీది గదికేసి ఉంచారు. అక్కడ అంతా నిశ్శబ్దంగా ఉంది. కల్నలుగారు, సింహంగారు బుద్ధిగానే కూర్చున్నారని ఇద్దరూ సంతోషిస్తుండగా, "సాహసము శాయరా డింబకా" అని సింహంగారి అరుపు వినిపించింది.

అనసూయగారు ఉలిక్కిపడి లేవబోతుండగా, "రాకుమారి లభిస్తుందిరా, డింగరీ" అని కల్నలుగారి అరుపు సమాధానంగా వినిపించింది.

సతీ సావిత్రిగారు ఉలిక్కిపడింది కాని లేవలేకపోయింది. "ఏమిటి?" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"మీరు కూర్చోండి! నేను చూసొస్తా" అంది (అనసూయగారు) బదులు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

సింహంగారి గదిలో ప్రవేశించిన అనసూయగారు తన కళ్ళని తనే నమ్మలేకపోయింది. సింహంగారు, కల్నలుగారు చెట్టపట్టా లేసుకుని పెద్దగా అరుస్తూ మాట్లాడుకుంటున్నారు.




అనసూయగార్ని చూస్తూ సింహంగారు, "కళ్నాలు రావంటే ఎవడో అనుకున్నా, అనసూయా! వీడూ, నేనూ చిన్నప్పుడు కలిసే చదువుకున్నాం. అప్పుడు వీడు డ్రమ్ములా ఎంత లావుగా ఉండేవాడో తెలుసా?" అన్నారు అనసూయగారితో.

"ఎప్పుడూ... పెళ్ళికాక ముందు కదూ అని, అవును కాని, ఒరే, నువ్వు సింహంలాగే ఉండేవాడివి—ఇలా పిల్లిలా ముంగివి అయిపోయావేవిటి?" అన్నారు కళ్నాలుగారు.

"ఎప్పుడూ? పెళ్ళి కాకముందు కదూ" అన్నారు సింహంగారు గత జన్మ గుర్తుకు తెచ్చుకుంటూ.

కటకటమని తిరగలి చప్పుడలా వినిపించి, "ఏవిటా చప్పుడు?" అనడిగారు అనసూయగారి కేసి చూస్తూ.

ఆవిడవళ్ళు నూరడం ఆపుచేసి బలవంతాన ఓ నవ్వు నవ్వి, "మీ రిద్దరూ మాట్లాడుకుంటోండి" అని వెళ్ళిపోయింది.

"అలా బెల్లం కొట్టిన రాయిలా గంట సేపు కూర్చున్నావు కాని, మాట్లాడలేదేంరా?" అన్నారు సింహంగారు కళ్నాలుగారి వీపు మీద ఓ చరుపు చరిచి.

ఎవరి పెళ్ళాల వలన ఎవరు ఎన్నికష్టాలు పడుతున్నదీ మనసు విప్పి మాట్లాడుకున్న తరవాత అబ్బిగాడు గుర్తు కొచ్చాడు సింహంగారికి.

"వాడు క్రికెట్ కామెంటరీ వింటే విననీ— నా కభ్యంతరం లేదు కానీ..." ఉదయం విషయం గుర్తు కొచ్చి గొంతు హెచ్చించారు" నేను అన్నం తినడానికి కూర్చుంటే నా ప్రక్కనే ట్రాన్సిస్టరు ఎందుకు పెట్టాలంటాను. నాకు అన్నం సయించదు కదా!"

కళ్నాలుగారు సానుభూతి చూపించారు.

ఆయన సానుభూతితో సింహంగారు మరింత విజృంభించారు. "వాడు వింటే సరిపోదూ? హాలులో టి. వి. పెడతాడు. గదిలో రేడియో పెడతాడు. అదికాక జేబులో ట్రాన్సిస్టరు పెట్టుకు తిరుగుతాడు. మరొక విషయం చెప్పనా? వాడు ఐదురోజుల కామెంటరీ టేపు చేసుకుని. ఏవీ తోచనప్పుడు సినిమా పాటలు విన్నట్టు వింటాడు. ఇదెక్కడైనా చూశావా?"

లేదన్నట్టు కళ్నాలుగారు అడ్డంగా తల ఆడించారు.

"వాడికి పిచ్చి" అని తేల్చి, "ఇదంతా నువ్వు అనుభవించాలి" అని కళ్నాలుగార్ని హెచ్చరించారు సింహంగారు.

"నే ననుభవించడం ఏమిటి?" అంతవరకు శ్రద్ధగా వింటున్న కళ్నాలుగారు అయోమయంగా.

"వాడు నీకు అల్లుడైతే నువ్వుకాక ఎవరు అనుభవిస్తారు?"

కళ్నాలుగారు షాక్ తగిలినట్టు సోఫా లోంచి పైకెగిరారు. ఇంతవరకు సింహంగారు బావమరది వలన పడుతున్న బాధకు ఉదారంగా సానుభూతి కురిపించేస్తున్నారు గాని. సింహంగారి స్థానంలో తను ఉండవలసి వస్తుందని ఆయనకు తట్టలేదు.

"ఏవిటి నువ్వంటున్నది!" పాలిపోయిన మొహంతో అడిగారు కళ్నాలుగారు.

"నీ అల్లుడు గురించి చెబుతున్నా! వాడు చిన్నప్పట్నుంచీ అంతే. 'అక్కా! బావ సిగరెట్లు కాలుస్తున్నాడేవ్', 'అక్కా! బావ సామానుగదిలో కూర్చుని పెసరట్లు తినేస్తున్నాడేవ్' అని నామీద స్పైయింగ్ చేసి వాళ్ళ అక్కకి చేరే సేవాడు. ఇంట్లో గూఢచారి ఉంటే చాలా కష్టం. రేప్పొద్దున 'అత్తా! మామ ఇలా చేశాడు', 'అత్తా! మామ అలా చేశాడు' అని నీ గురించి రిపోర్టులు పంపిస్తుంటాడు."

కళ్నాలుగారు గుటకలు మింగడం మొదలుపెట్టారు. సింహంగారు కిటికీలోంచి బయటకు చూసి "అడుగో! మాటలోనే వచ్చాడు" అని అప్పుడే గేటులోంచి గార్డెన్‌లో కూర్చున్న అక్కగారి దగ్గరకు వెడుతున్న అబ్బిగాణ్ణి మేడమీది కిటికీలోంచి కళ్నాలుగారికి చూపించారు.

కళ్నాలుగారు ఒక నిముషం అబ్బిగాణ్ణి పరిశీలనగా చూశారు. అంతకుముందు సింహంగారి మాట వలన అబ్బిగాడంటే కలిగిన అయిష్టత, చూసిన తర్వాత రెట్టింపైంది.

"చూశావా? స్టెప్ కటింగు చేయించిన తోడేలులా మొహం, వాడూను."

"తోడేలు కాదు—బంబోబా" అని సరిదిద్దారు కళ్నాలుగారు.

"అదేవిటి?"

"కాంగో అడవుల్లో ఇలాటి జంతువునే చూశా! దాన్ని వాళ్ళు బంబోబా అంటారు." కళ్నాలుగారు వివరించారు.

"ఐసి, బంబోబా!"

"ఎస్! బంబోబా!" అని దిగులుగా సోఫాలో కూలిపోయారు కళ్నాలుగారు.

సింహంగారు కళ్నాలుగారి కేసి జాలిగా చూశారు. అబ్బిగాడివలన ఆయన ఎటువంటి కష్టాల్లో పడబోతున్నారో ఊహించిన ఆయన కళ్ళు చెమర్చాయి.

"ఏం చెయ్యమంటావురా?" కళ్నాలుగారు జాలిగా అడిగారు.

కళ్నాలుగారి కేసి సానుభూతిగా చూస్తున్న సింహంగారికి మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. తన ప్లాను జయప్రదమవుతే అబ్బిగాడు తన్ను పెట్టిన బాధలకి వాడు జీవితాంతం మరిచిపోలేని దెబ్బ తియ్యొచ్చు. స్నేహితుడితో సంబంధం కలుపుకోవచ్చు. ఒకే దెబ్బకు రెండు పక్షులు. ఆయన హుషారుగా లేచి అలమైరాలోంచి ఫోటో ఆల్బం తీశారు.

"ఈ ఫోటో చూశావా? మా తమ్ముడి కొడుకు. వాడూ నాలాగే బుద్ధిమంతుడు. మీ అమ్మాయికి ఈడూ-జోడూ."

కళ్నాలుగారు ఫోటో చూసి సంతోషించారు. "నా కిష్టమే! మా అమ్మాయికూడా మాఆవిడ పోలిక కాదు. చాలా నెమ్మదస్థురాలు-నాలాగే!"

"మనిద్దరం చక్కగా బంధువు లవొచ్చు."

"అవ్వచ్చు, కాని..." కళ్నాలుగారు తన నిస్సహాయ స్థితిని వెల్లడించారు. "మా ఇంట్లో నా మాట చెల్లదు." పెళ్ళి చెయ్యటం కాని, ఆపుచెయ్యటం కాని ఆయన చేతుల్లో లేదు. ఏవి చెయ్యాలో తెలియక ఇద్దరూ మౌనంగా ఉండిపోయి ఆలోచిస్తుండగా -"ఏవండీ" అని అనసూయగారి కేక విన్పించింది.

** ** **

అయిదు రోజుల క్రికెట్ మాచ్‌లో ఈరోజు ఆఖరి రోజు. అయిదు గంటలకు మాచ్ అయిపోతుంది. ఇండియా బాటింగ్ చేస్తోంది. మాచ్ గెలవడానికి ఇంకా నలభైమూడు పరుగులు కావాలి. ఇప్పటికి అయిదు వికెట్లు పడిపోయాయి. ఇంగ్లండు జట్టు విజృంభించి వికెట్లు తినేస్తోంది. అబ్బిగాడిలోన స్పెన్సు పెరిగిపోతోంది.


"త్వరలోనే ఆ మూడు ముళ్ళూ వేయిస్తే సరి." అనసూయగారు అంది.

"మూడు కాదు, ఆరు."-ఒక చెవితో పెళ్ళి కబుర్లు, రెండవ చెవితో కామెంటరీ వింటున్న అబ్బిగాడు అరిచాడు- అప్పుడే పడిపోయిన ఇంకో వికెట్ కలిపి.

"అదేవిటి? ఆరంటా డేవిటి?" అంది సావిత్రిగారు అనుమానంగా.

'వాడి తలకాయ' అనబోయి, మళ్ళీ తమ్ముణ్ణి కాబోయే అత్తగారి ముందు అవమానించడం ఇష్టం లేక, "వాడు వికెట్ల గురించి మాట్లాడుతున్నాడు" అంది ప్రయత్నపూర్వకంగా నవ్వుతూ.

"ఓహో" అంది సావిత్రిగారు. వచ్చినప్పటి నుంచి అబ్బిగాడి వరస ఆవిడకి నచ్చలేదు. పెళ్ళి విషయం కంటె క్రికెట్‌కి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్న అబ్బిగాడంటే ఆవిడకి అయిష్టత కలిగింది.



కొంచెం సేపు మౌనంగా ఉన్న తర్వాత, "అది వారం ఒకసారి చూస్తే సరి" అంది అనసూయగారు -పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ చూసుకుంటే మంచిదని చెబుతూ.

"ఇంక చూసే దేవిటి? ఇది అయిదోరోజు. అంతా అయిపోయింది-గోవిందా గోవింద" అన్నాడు అబ్బిగాడు ట్రాన్సిస్టరు కింద పడేసి, రెండు చేతుల్లోనూ తల పెట్టుకుని.

సావిత్రిగారు మాట్లాడకుండా ఇంకోసారి అనుమానంగా చూసింది అబ్బిగాడికేసి.

"మావాడికి క్రికెట్ పిచ్చి" అంది అనసూయగారు సర్దిచెబుతూ. నిజానికి అబ్బిగాడి ప్రవర్తన ఆవిడకే చిరాగ్గానే ఉంది.

ఈసారి 'ఓహో' అనలేదు సావిత్రిగారు. "ఏదో పిచ్చిలెండి" అంది అదోరకంగా నవ్వుతూ.

ఆ మాట తీరూ. ఆ నవ్వు నచ్చలేదు అనసూయగారికి. ఆవిడ మనసులోనే చిటపటలాడుతుండగా హఠాత్తుగా అబ్బిగాడు లేచి నుంచుని, కళ్ళజోడు తీసి జేబురుమాలుతో తుడిచి మళ్ళీ తగిలించుకుని, చిత్తుగా ఇండియా ఓడిపోవడానికి కారణాలు మనసులో విశ్లేషిస్తూ తలవంచి నేలను రెండు నిముషాలు, తలెత్తి ఆకాశాన్ని మరో రెండు నిముషాలు ఉలుకూ పలుకూ లేకుండా చూసి ఇంట్లోకి దారితీశాడు అక్కగార్ని, అత్తగార్ని మర్చిపోయి.

ఇది ఏ రకమైన పిచ్చి అన్నట్లు సావిత్రిగారు అనసూయగారి కేసి చూశారు. అనసూయగారు అబ్బిగాడి కేసే చూస్తున్నారు -పళ్ళు బిగించి.

గార్డెనులోంచి లోపలకు నడిచి మంచంమీద వెల్లకితలా పడుకుని పైన తిరుగుతున్న ఫాను కేసి దీక్షగా చూస్తూ ఇండియా ఓడిపోయినందుకు సావకాశంగా విచారిస్తున్న అబ్బిగాడికి హఠాత్తుగా తను అక్కగారిని, అత్తగారిని గార్డెన్‌లో వదిలేసి వచ్చిన సంగతి గుర్తుకు వచ్చింది. "అరరే" అనుకుని మళ్ళీ గార్డెన్‌లోకి పరుగుతీస్తుండగా అనసూయగారి పిలుపు అందుకుని క్రిందికి దిగి వస్తున్న సింహంగారు, కల్నలుగారు చూశారు.

"బంబోబా" అన్నారు కల్నలుగారు పళ్ళు నూరుతూ, మెల్లిగా.

"బంబోబా" అన్నారు సింహంగారు పిడికిలి బిగించి.

"బంబోబా?" అన్నాడు ముందు పరిగెడుతున్న అబ్బిగాడు ఆగిపోయి వెనక్కు తిరిగి.

అబ్బిగాడు అన్న మాట మాత్రమే విన్పించిన సావిత్రిగారు ఉలిక్కిపడి చూసింది- ఈ అబ్బాయికి మళ్ళీ ఏమైందా అని.

"బంబోబా ఏవిటి? ఆవిడ అబ్బిగాణ్ణి అడిగింది.

"బంబోబా ఏవిటి?" అబ్బిగాడు సింహంగారిని అడిగాడు.

"బంబోబా ఏవిటి?" సింహంగారు అబ్బిగాణ్ణి ఎదురు ప్రశ్నించారు.

"మీరే కదా అంట?" అన్నాడు అబ్బిగాడు బుర్ర గోక్కుంటూ.

"మేమా? అసలు నోరు మెదపందే?" అన్నారు కల్నలుగారు ఆశ్చర్యం నటిస్తూ.

అబ్బిగాడు మళ్ళీ బుర్ర గోక్కున్నాడు. అనసూయగారు ఎవరూ చూడకుండా తల పట్టుకుంది. సింహంగారు, కల్నలుగారూ మనసులోనే గొల్లున నవ్వారు. సావిత్రిగారికి మాత్రం ఇంక ఏ అనుమానం రాలేదు. అబ్బిగాడికి కొంచెం పిచ్చి అని నిర్ణయానికి వచ్చేసింది.

** ** **

ఇంటికి వెడుతుండగా సావిత్రిగారు అడిగింది "అబ్బాయి నచ్చాడా?"

కల్నలుగారి అభిప్రాయం తెలుసుకునే అలవాటు ఆవిడకు లేదు. కాని, మనసంతా చికాకుగా ఉండి అలా అడిగింది.

"నీకు నచ్చితే నాకు నచ్చినట్లే." గాలి ఎటు వీస్తోందో తెలియని కల్నలుగారు జాగ్రత్తగా సమాధానం చెప్పారు.

"వేపకాయంత వెర్రి ఉందేమోనని నా అనుమనం."


"వేపకాయ కాదు, వెలక్కాయంత."

"మీ కెలా తెలుసు?"

"సింహంగాడు చెప్పాడు." పెళ్ళి తప్పించడానికి మార్గం కనుపించగానే టక్కున అప్రయత్నంగా ఆయన మీదకు తోసేశారు. "నా బావమరది పెళ్ళి ఆగిపోతే నాకు బాధేకాని నీ దగ్గర నిజం దాచను అంటూ అంతా చెప్పాడు. ఆ అబ్బాయికి నిజంగా పిచ్చట."

"కారావండి." సావిత్రిగారు అరిచింది.

"ఎందుకు?" కారాపి భయం భయంగా అడిగా




ADVT

రు కల్నలుగారు.

"పిచ్చేణ్ణి మనకు అంటకడదామని చూసిందా! ఇప్పుడే వెళ్ళి అడిగేస్తా."

కల్నలుగారు గుటకలు మింగారు—"చూడు! నరసింహం నేను ఫ్రెండునని, ఎవరితోనూ చెప్ప నని ఒట్టు పెట్టించుకుని మరీ చెప్పాడా? ఇప్పుడు నువ్వు వెళ్ళి అడిగే వనుకో. అనసూయగారు వాణ్ణి అప్పడం నమిలేసినట్లు నమిలెయ్యదూ!"

"అవును."

"నీకు బాగా తెలును. అంచే తేవిటంటే మనం వాళ్ళ నడగొద్దు. చెప్పు తీనుకు కొట్టినట్లు మరో మంచి సంబంధం చూసి చేసేస్తే బాగుంటుంది."

"ఇంత కష్టపడి ప్రయత్నాలు చేస్తే ఇది ఇలాగయ్యింది కదా!"

"నువ్వు వింటానని హామీ ఇస్తే ఓ మాట చెబుతా! నేను ఇంకో సంబంధం చూశా."

"మీరా?" ఆయన తెలివితేటలమీద ఆవిడకి నమ్మకం లేదు కాని, మునిగిపోయేవాడు గడ్డిపర కని కూడా పట్టుకున్నట్లు, "ఎక్కడ?" అనడిగింది నీరసంగా. వచ్చ జెండా ఊగగానే కల్నలుగారు విజృంభించి అంతా వివరించారు.

ఆవిడ ఓపిగ్గా విని, కొంచెం సేపు ఆలోచించి, "కారు స్టార్టు చెయ్యండి" అంది.

కల్నలుగారు హుషారుగా కారు ముందుకు పోనిచ్చారు.

** ** **

నెలరోజుల తర్వాత ఓరోజు ఉదయం సింహంగారు హడావిడిగా, "అనసూయా! ఇలా రా "ఒరే డబ్బిగా! అర్జంటు" అని అరిచారు. ఏమైందోనని కంగారు పడుతూ పరిగెట్టుకొచ్చిన వాళ్ళతో, "మా తమ్ముడి కొడుకు పెళ్ళి! శుభలేఖ వచ్చింది. ఒరే డబ్బి! మనందరం పెళ్ళికి వెళ్ళాలి రోయ్" అన్నారు.

"పెళ్ళికూతు రెవరు?" అంది అనసూయగారు శుభలేఖ అందుకుంటూ.

"మనకు తెల్సున్నవాళ్ళే...కల్నలు రావుగాడి అమ్మాయి లేదూ...శశిరేఖ..."

అనసూయగారు కరెంటు షాక్ తగిలినట్లు శుభ లేఖ వదిలేసింది.

ఓరకంట అది గమనిస్తూ అబ్బిగాడికేసి తిరిగి, "ఏరా డబ్బిగా! గుర్తుందా? నిన్ను చూసుకో డానికి రాలేదూ? 'బంబోబా' 'బంబోబా' అని వాళ్ళని అదరగొట్టావే—ఆ అమ్మాయి: చాలా బావుంటుంది. మా తమ్ముడి కొడుక్కి ఈడు-జో డూ..."

"అక్కా! నేను ఆఫీసుకు వెడుతున్నాను" అన్నా డు అబ్బిగాడు మాడిన పెసరట్టు మొహంతో.

"ఒరే అబ్బిగా! ఈరోజు సెలవు పెట్టెయ్యకూడ దూ."

"ఏం? మీ ఆనందంలో వాడు పాలుపంచుకోవా లా?" అనసూయగారు కయ్‌మంది.

"వాడి క్షేమం గురించే చెబుతున్నాను. వాడికి అసలే మనసు బాగోలేదు-ఆ అమ్మాయి అచ్చు జయప్రదలా ఉంటుందటరా అబ్బిగా-వీడు స్కూ టరు తీసుకెళ్ళి ఏ రైలుకో గుద్దించేసినా గుద్దించే స్తాడు" అన్నారు సింహంగారు అబ్బిగాడిమీద సానుభూతి కురిపిస్తూ.

"ఏం? మావాడికి ఇంతకంటె మంచి సంబంధం దొరకదా? ఈ అమ్మాయి కాకపోతే రంభలాంటిది ఇంకోత్తి వస్తుంది?" ఆవిడ మళ్ళీ కయ్‌మంది.

"వస్తుంది! వస్తుందిరా, డబ్బిగా!" నువ్వు బాధ పడుకు. ఎవత్తో ఒకత్తి చేసుకుంటుందిలే" అని ఓదార్చి, స్కూటరు వెనుక కొంచెం దూరం పరిగె ట్టి, "ఒరే అబ్బిగోయ్! అఘాయిత్యం చెయ్యకురో య్" అనరిచారు.

ఉడుకుమోత్తనంతో మండిపడుతూ ఏమీ అన లేక నిలబడిపోయింది అనసూయగారు.

** ** **

పెళ్ళయిన వారం రోజుల తర్వాత ఓ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు కల్నలుగా రింట్లో ఫోను మోగింది. సావిత్రిగారు ఫోను అందు కుంది. పెళ్ళయి వారం రోజులైనా ఖైదీ జెయిలుకి ఎందుకు తిరిగి రాలేదో తెలుసుకుందామనీ, బెయిలు అయిపోయిందని సింహంగారికి వార్నింగివ్వడానికి సతీ అనసూయగారు ఫోను చేసింది.

"అమ్మాయి పెళ్ళికి మీరు రానేలేదు."

"అవును! వీలుపడలేదు."

"అవును! నరసింహంగారు చెప్పారులెండి" అంది సావిత్రి అర్థోక్తిగా.

అవతల మనిషికూడా ఆడదే కనుక, ఎదుటి మనిషి హావభావాలు కనుపించకపోయినా 'లెండి' అనే మాట నొక్కి పలకడంలో ఎన్ని అర్థాలున్నా యో అన్ని అర్థాలు క్షణంలో గ్రహించేసింది. ఒక క్షణం లైనుమీద నిశ్శబ్దం ఏలింది.

"మీ తమ్ముడికి ఏవైనా సంబంధం కుది రిందా?" సినిమాలో ఛాయాదేవిలా బాణం వది లారు సావిత్రిగారు.

"అంత తొందరేం పడటంలేదు. ఆడపిల్లయి తే తొందర పడాలికాని వాడికేవిటిలెండి!"—ఎదు రు బాణం వదిలింది సినిమాలో సూరేకాంతంలా అనసూయగారు.

"ఒకోసారి మగపిల్లాడైనా ఎలాగోలా పెళ్ళి చెయ్యాల్సిన పరిస్థితి వస్తుంది లెండి."

"మా కలాంటిది లేదులెండి."

"నిజం నిప్పులాంటిది—దాచేస్తే దాగదు లెండి."

సూరేకాంతంగారికి ఛుర్రుమంది—"ఆ అనే దేవిటో సూటిగా అంటే సమాధానం చెబుతాను. డొంకతిరుగుడు మాటలు దేనికి?"

- ఛాయాదేవిగారు డిప్లమసీ ముసుగు తీసేసి యుద్ధరంగంలోకి దిగిపోయారు—"సూ టిగా చెప్పాలా? ఆ పిచ్చాడిని మా అమ్మాయికి కట్టబెట్టాలని చూశారు."

సూర్యకాంతంగారికి షాక్ తగిలింది—"పిచ్చా డెవరు?"

"మీ తమ్ముడు."

"మీ కేవన్నా పిచ్చా?"

"మాకు కాదు, మీ తమ్ముడికి."

సూరేకాంతంగార్కి అంతా అయోమయంగా ఉంది—"ఎవరు చెప్పారు మీకు?"

"ఆ కుర్రాడి వ్యవహారం చూస్తేనే అనుమానం వచ్చింది. అన్నయ్యగారు చెప్పకపోతే పిల్లదాని గొంతు కోసేవాళ్ళం."

"అన్నయ్యగా రెవరు?"

"నరసింహంగారు."

ఉరుము ఉరిమి మంగలంమీద పడింది. ఆ సమయంలో మంగలంగారు భోంచేసి, కిళ్ళీ వేసి, సిగరెట్టు కాలుస్తూ కల్నలుగారితో సహా హాలులో ప్రవేశించారు.

పాశుపతాస్త్రం ప్రయోగించి శత్రు సంహారం చేసి విజయశంఖం పూరించింది ఛాయాదేవిగా రు—"మాట్లాడరేం?"

"నరసింహంగా రున్నారా అక్కడ?"

సిగరెట్టు వాసన ఫోను ద్వారా అనసూయగా రు పసిగట్టగలదా అని డౌటొచ్చి, ఎందుకైనా మంచిదని సిగరెట్టు క్రింద పడేసి దానిమీద నుంచుని, నోట్లో కిళ్ళీని ఓ పక్కకు గెంటి బుగ్గకో సి నొక్కి బిగించి, కింద పడిపోకుండా తల పైకెత్తి, "హ...ళో...ళో...ఓ...ఓ..." అనరిచారు సింహంగారు ఫోను అందుకుని.

"మీరు వెంటనే రండి."

"హళో...హళో...ఎందుకు?" సమాధానంగా డయల్ టోను మాత్రం వినిపించింది. ఎందుకు పిలిచిందా అని ఆలోచిస్తూ అలా బొమ్మలా నిలబడిపోయిన సింహంగారిని, కాలు క్రింద సిగరెట్టు చుర్రుమని అంటించి ఈ లోకంలోకి తీసుకువచ్చింది.

"మా ఆవిడ వెంటనే రమ్మంటోందిరా" అన్నా డు సింహంగారు కల్నలుగారి కేసి తిరిగి. కారణం ఏదైనా ఆజ్ఞను అతిక్రమించడం ఆయన కి అలవాటు లేదు. అందుచేత వేంటనే కారులో బయల్దేరుతూ, "వెళ్ళొస్తానురా" అన్నారు కల్న లుగారి కేసి తిరిగి చెయ్యి ఊపుతూ.

సావిత్రిగారి ద్వారా విషయమంతా తెలుసుకు న్న కల్నలుగారు దుఃఖం ఆపుకుంటూ తిరిగి చెయ్యి ఊపారు.

రానున్న ప్రమాదం ఎరుగని సింహంగా రు—"తేడదేడదై వలలో పడెనే పావం పసివా డు! అయ్యో పావం పసివాడు...డాడం డడిడా డు" అని కూనిరాగం తీస్తూ కారు ముందుకి ఉరికించారు.

కారు కనుమరుగయ్యేదాకా విషాదంగా చెయ్యి ఊపి, సింహంగారి ఆత్మశాంతికి చర్చీల్లోనూ, మసీదుల్లోనూ ప్రార్థనలు చెయ్యడానికి మనుమ ల్ని తరిమి, తను స్వయంగా దేవాలయంలో ప్రార్థన చెయ్యడానికి పరుగు తీశారు కల్నలుగారు.

*

